నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 26 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

## శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, అక్టోబర్ 25 : నేరస్తుల నుంచి వివిధ రూపాల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కృషి చేస్తున్నదని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో 'ఓపెన్ హౌస్' నిర్వహించారు. పోలీసుల విధులు, ఆయుధాలు, వాటి వినియోగంపై జిల్లా వ్యాప్తంగా 75 పాఠశాలలతోపాటు యూట్యూబ్ లింక్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు సైకిల్ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సురేందర్ రావ్, డీఎస్పీలు సురేందర్ రెడ్డి, హాజీబుల్లా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు బ్రేక్

## తేమ పేరిట నిలిపివేసిన సీసీఐ



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో రైతులు

- ధర తగ్గించిన ప్రైవేట్ వ్యాపారులు
- ఆగ్రహంతో రోడ్డెక్కిన రైతన్నలు
- మార్కెట్‌యార్డులో వందల సంఖ్యలో పత్తి వాహనాలు
- ఉదయం నుంచి రాత్రి వరకు రైతుల పడిగాపులు
- తిండి, తిప్పలు లేక ఇబ్బందులు

ఆదిలాబాద్, అక్టోబర్ 25 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం ప్రారంభం కావాల్సిన పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన నెలకొన్నది. పత్తిలో తేమ శాతం ఎక్కువ ఉందనే కారణం చూపుతూ కొనుగోలుకు సీసీఐ నిరాకరిచింది. ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తారని ఆశించిన రైతులకు సైతం నిరాశే మిగిలింది. 8 శాతం తేమతో క్వింటాల్‌కు రూ.7200 మించి కొనుగోలు చేసే ప్రసక్తి లేదని వ్యాపారులు పట్టుబట్టారు. వ్యాపారులతో ధర విషయంలో కలెక్టర్ రాజర్షి షా, బోథ్ ఎమ్మెల్యేలు చర్చించినా ఫలితం లేకుండా పోయింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన పంట కొనుగోళ్లు రాత్రి 8 గంటలైనా ప్రారంభం కాలేదు. పంట కొనుగోళ్లపై ఆశలు పెట్టుకున్న రైతులు గురువారం రాత్రి నుంచి వాహనాల్లో పంటను ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం వరకు దాదాపు 300 వరకు వాహనాలతో మార్కెట్ యార్డు నిండిపోయింది. వందల సంఖ్యలో రైతులు తమ పంటను విక్రయించడానికి మార్కెట్‌కు తరలివచ్చారు.

### చేతులెత్తేసిన సీసీఐ

పంట కొనుగోళ్లలో భాగంగా ఉదయం మార్కెటింగ్ శాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు. సీసీఐ ధర క్వింటాల్‌కు రూ.7521గా ప్రకటించారు. వేలంలో పాల్గొన్న ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6700 నుంచి ప్రారంభించి రూ. 7150 వద్ద ముగించారు. సీసీఐ ధర ఎక్కువగా ఉండడంతో పంట కొనుగోళ్లను సీసీఐ చేపడుతుందని ప్రకటించిన అధికారులు ఒకటవ నంబర్ కాంటా వద్ద కొబ్బరికాయ కొట్టారు. మార్కెటింగ్ సిబ్బంది తేమ శాతాన్ని పరీక్షించగా 19, 22, 25 శాతం వరకు వచ్చింది. నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 శాతం వరకు తేమ ఉంటేనే పంటను కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు చేతులెత్తేశారు. కలెక్టర్ రాజర్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ధర విషయంలో ప్రైవేట్ వ్యాపారులతో చర్చించినా ఫలితం లేకుండా పోయింది. మధ్యాహ్నం సమయంలో కలెక్టర్ మార్కెటింగ్ కార్యాలయంలో వ్యాపారులతో మరోసారి చర్చలు జరిపి క్వింటాల్‌కు రూ. 7200తో కొనుగోలు చేసేలా ఒప్పించారు. తేమ శాతంలో 8 నుంచి 12 ఉంటేనే కొంటామని వ్యాపారులు చెప్పడంతో రైతులు ఇందుకు నిరాకరించారు. దీంతో పంట కొనుగోళ్లు జరగలేదు. కలెక్టర్ వ్యాపారులతో నాలుగు గంటలకు పైగా రాత్రి 8 గంటల వరకు చర్చలు నిర్వహించారు.

### రైతుల ఆందోళన

తేమ పేరిట సీసీఐ పంట కొనుగోళ్లకు నిరాకరించడం, ప్రైవేట్ వ్యాపారులు ధర విషయంలో పట్టు వీడకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకపోవడంతో మార్కెట్‌యార్డు ముందున్న రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలోని పంజాబ్‌చౌక్‌లో ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పంట కొనుగోళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకొని వచ్చిన రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు 10 గంటల పాటు తిండి తిప్పలు లేక, ఎండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది.



రైతులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



పత్తిలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



రైతులతో మాట్లాడుతున్న సీసీఐ అధికారి, కలెక్టర్

## రైతు పోరుబాట విజయవంతం

- కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసన సెగ
- మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : రైతుల సమస్యలపై ఆదిలాబాద్‌లో గురువారం నిర్వహించిన రైతు పోరుబాట బహిరంగ సభ విజయవంతమైందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆయన బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం వినేందుకు సభకు హాజరైన రైతులు, ప్రజలు ఆసక్తి కనబర్చారని, పోరుబాట సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసన సెగ తగిలిందన్నారు. ఈ సభకు రైతులు, ప్రజలు రాకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని, ఇందిరమ్మ ఇండ్లు రావంటూ, పింఛన్లు మంజూరు కావంటూ బెదిరించారని తెలిపారు. వారి బెదిరింపులకు భయపడకుండా స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారని తెలిపారు. ఈ సభ కోసం నియోజకవర్గంలోని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వారం పాటు అహర్నిశలు కష్టపడ్డారన్నారు. ఈ కార్యక్రమంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. సభకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, రహుత్ మనోహర్, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, విజ్జగిరి నారాయణ, నర్సింగరావు, అలాల అజయ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## మత్స్యకారులను నిండా ముంచిన సర్కారు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి, అక్టోబర్ 25 : ప్రస్తుతం యాసంగి పంటలు ప్రారంభించే సమయమని, సాగుకు నీటిని వదిలితే చెరువులు ఖాళీ అవుతాయని, ఈ సమయంలో చేప పిల్లలను పంపిణీ చేయడం మత్స్యకారులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచడమేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం తాంసి మండలంలోని వడ్డాడి మత్తడి వాగులో 2.50 లక్షల చేప పిల్లలను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో చేప పిల్లలు విడుదల చేసి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో 5 లక్షల చేప పిల్లలు పంపిణీ చేస్తే కాంగ్రెస్ సర్కార్ సగానికి సగం తగ్గించిందని గుర్తు చేశారు. ఎన్నడూ ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి రాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావ్, బీఆర్ఎస్ మాజీ మండల కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, నాయకులు వినోద్ రెడ్డి, మొట్టె కిరణ్ కుమార్, మహేందర్, కిషన్, రజినీకాంత్ రెడ్డి, రఘు, రమణ, అబ్దుల్లా, చంద్రన్న పాల్గొన్నారు.

### తేమ పేరిట పత్తి ధర తగ్గించొద్దు

గుడిహత్నూర్, అక్టోబర్ 25 : పత్తిలో తేమ శాతం పేరిట ధర తగ్గించవద్దని, రైతులకు మద్దతు ధర వచ్చేలా చూడాలని అధికారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. గుడిహత్నూర్ మండలంలోని డోంగర్‌గావ్ గ్రామ సమీపంలో రాణి జిన్నింగ్ మిల్లులో శుక్రవారం పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. అక్కడక్కడ వర్షాలు కురుస్తుండడంతో తేమ శాతం ఎక్కువగా ఉండవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు ఆమోదయోగ్యమైన ధర చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జీ తిరుమల్‌గౌడ్, జాదవ్ రమేశ్, ముండె సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు-27 ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 25 : కాళేశ్వరం ప్రాజెక్టు-27వ ప్యాకేజీ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు-27వ ప్యాకేజీ పథకంలో భాగంగా లక్ష్మీనర్సింహ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనుల పురోగతి వివరాలను అధికారులను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అలసత్వం చేయకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటి పారుదలశాఖ ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, డిప్యూటీ ఈఈ నరేశ్, ఏఈఈలు మీరాజొద్దీన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

### మాతృత్వ మరణాలు తగ్గించండి..

జిల్లాలో మాతృత్వ మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హైపవర్ కమిటీని ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని గ్రామాల్లో హై రిస్క్ గర్భిణులను గుర్తించి వారికి పోషకాహారం, మెరుగైన వైద్య సేవలు, మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యాధికారులు సురేశ్, సౌమ్య తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు



పులిదాడిలో గాయపడిన ఎద్దు

## పులి సంచారం..!

- ఎద్దు, రెండు మేకలపై దాడి
- అటవీ అధికారుల గాలింపు

సారంగాపూర్, అక్టోబర్ 25 : మండలంలోని రవీంద్రనగర్‌తండా అటవీప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుండడంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి పెద్దపులి కనబడిందని మేకల కాపరి చెప్పడంతో శుక్రవారం ఫారెస్ట్ అధికారులు వచ్చి మూడు బృందాలుగా ఏర్పడి పులికోసం కూంబింగ్ నిర్వహించారు. ఎక్కడా జాడ కనిపించకపోవడంతో ఇప్పచెలిమి, పెండల్‌ధరి, సిరిపెల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు. పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం అడెల్లితండాకు చెందిన ఆడే మోహన్, అశోక్‌లకు చెందిన ఎద్దు, రెండు మేకలపై పులి దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో ఫారెస్ట్ అధికారులు గాలింపు చర్యలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో రామకృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వో వేణుగోపాల్, డీఆర్వో నజీర్‌ఖాన్, సిబ్బంది సంతోష్, ఫాజిల్‌హుస్సేన్ తదితరులున్నారు.

## ఆగ్రహజ్వాల

### కాంగ్రెస్ వైఖరిపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

- సీఎం దిష్టిబొమ్మల దహనం
- రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్



గుడిహత్నూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ రైతు పోరు బాట చేపట్టిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పలు మండలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

### గుడిహత్నూర్‌లో..

గుడిహత్నూర్, అక్టోబర్ 25: గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ జీ తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. పత్తి ధర తగ్గించవద్దని, రైతులకు ఆమోదయోగ్యమైన ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జాదవ్ రమేశ్, ముండె సంజీవ్, శగీర్, తెలంగే మాధవ్, గజానంద్ గిత్తె, బేర దేవన్న, దోమకొండ సుధాకర్, మాధవ్ కేంద్రె, ప్రశాంత్, సిందె రాము, తగరే ప్రకాశ్, వెంకట్‌రావ్, శ్రీనివాస్‌గౌడ్, పాటిల్ రాందాస్, రైతులు, అజీం, రావణ్ ముండె, తదితరులు పాల్గొన్నారు.

### సొనాల గ్రామంలో..

బోథ్, అక్టోబర్ 25 : బోథ్ మండలంలోని సొనాల బస్టాండ్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ కోసం పోరుబాట చేపట్టిన కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### సుంకిడిలో..

తలమడుగు, అక్టోబర్ 25 : మండలంలోని సుంకిడి బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఏ ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని నిరసనలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, కన్వీనర్ కృష్ణ, రమణ, ముచ్చ రేఖ రఘు, వెల్మ శ్రీనివాస్, అభిరాం రెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్లా, ప్రకాశ్, సుదర్శన్ రెడ్డి, పల్లవి, ఆశన్న యాదవ్, జనార్దన్, రవికాంత్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు సాకే ఆనంద్, కంది నర్సింహులు, పోచ్చన్న, రాజేశ్వర్, దేవ్ రావ్, మాజీ ఎంపీటీసీ చంటి పాల్గొన్నారు.



తలమడుగు : సుంకిడిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రక్తదానానికి ముందుకు రావాలి

- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 25 : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీ జానకీ షర్మిల ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శాంతి భద్రతల కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియడారు. వారిని స్మరించుకుంటూ రక్తదానాలు, ఓపెన్ హౌస్‌లు, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పోలీసులతో పాటు యువకులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, నవీన్ కుమార్, ఆర్ఐ రాం నిరంజన్, శేఖర్, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏఆర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు కానిస్టేబుల్, ఎస్ఐ స్థాయి అధికారులకు వేర్వేరుగా వ్యాసరచన పోటీలను నిర్వహించారు.